క్లుప్తంగా

నిబంధనల మేరకే వ్యవహరించాలి

కడియం: కేబుల్, పంచాయతీ విద్యుత్ సిబ్బంది విద్యుత్ స్తంభాలు ఎక్కేటప్పుడు, కేబుల్ వైర్లు అమర్చేటప్పుడు నిబంధనల మేరకు వ్యవహరించాలని కడియం విద్యుత్ శాఖ ఏఈ రామారావు బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముందుగా తమ శాఖకు సమాచారం ఇస్తే విద్యుత్ సంబంధిత ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోగలుగుతామన్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ స్తంభాలు ఎక్కడం, వాటిపై కేబుళ్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ మేరకు సంబంధిత కేబుల్, పంచాయతీలకు సమాచారం అందజేసినట్లు తెలిపారు.

అమ్మవారికి సువర్ణ నేత్రాల సమర్పణ



సువర్ణ నేత్రాలను అందజేస్తున్న ఆంజనేయులు దంపతులు

కడియం: కడియపులంకలోని పుంతలో ముసలమ్మ అమ్మవారికి నర్సరీ రైతు పుల్లా ఆంజనేయులు, వీరవేణి దంపతులు బుధవారం సువర్ణ నేత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. నేత్రాలను అమ్మవారి ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు, పుల్లా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: సీతంపేట గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఓ.సుగుణ తెలిపారు. ఈ మేరకు బుధవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూలం వెంకన్న బాబు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ శిక్షణలో కథలు చెప్పడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష, చిత్రలేఖనం, వేదిక్ మాక్స్, తెలుగు పద్యాలు, పాటలు క్రాఫ్ట్ బొమ్మల తయారీ వంటివి నేర్పిస్తామన్నారు. జూన్ 11 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎం.వీరలింగం, డి.రాజు పాల్గొన్నారు.

మార్గాని కన్వెన్షన్ ప్రారంభం

కడియం: కడియపులంకలో మార్గాని శేషయ్య, సావిత్రమ్మ పేరిట నిర్మించిన కన్వెన్షన్ హాలు గురువారం నుంచి అందుబాటులోకి రానుంది. ప్రముఖ నర్సరీ రైతు, టీడీపీ నాయకుడు మార్గాని సత్యనారాయణ, తన సోదరులతో కలిసి తమ తల్లిదండ్రుల పేరిట ఈ కన్వెన్షన్ హాలును నిర్మించారు. లాభాపేక్ష లేకుండా అతి స్వల్పంగా నిర్వహణ ఖర్చులు మాత్రమే తీసుకుని ఈ కన్వెన్షన్ హాల్‌ను ప్రాజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

5న కృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ

కడియం: స్థానిక గోశాల వద్ద ఈనెల 5వ తేదీన శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి గోసంరక్షణ సేవాసమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) తెలిపారు. ఆంధ్ర పేపరుమిల్లు సౌజన్యంతో నిర్మించిన గోశాలలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారి విగ్రహంతో గ్రామోత్సవం, గోపూజ, యాగశాల ప్రదక్షిణ, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం

కడియం: మండలంలోని దుళ్ల గ్రామదేవత పోలేరమ్మ తీర్థమహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్ద జాతర, గురువారం చిన జాతర, శుక్రవారం తీర్థం నిర్వహిస్తారు. 7వ తేదీన అన్నసమారాధన జరుగుతుంది.

డాగ్ స్క్వాడ్‌కు టీషర్టుల పంపిణీ



టీ షర్టులు పంపిణీ చేస్తున్న మధుబాబు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కుక్కలను పట్టుకుని బర్త్ కంట్రోల్ ఆపరేషన్ నిర్వహించే మున్సిపల్ డాగ్ స్క్వాడ్ టీమ్‌కు బుధవారం టీషర్టులు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న మాట్లాడుతూ గతంలో గ్రీన్ కలర్ టీ షర్టులు ఉండేవని, తాజాగా ప్రత్యేక గుర్తింపుగా ఉండేందుకు రెడ్ కలర్ టీషర్టులు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని డిప్యూటీ ఎంహెచ్‌ఓ మధుబాబు చేతుల మీదుగా 20 మంది సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అన్నమయ్య, డివైన్ మేనేజర్ ధనేకుల లావణ్య పాల్గొన్నారు.



శ్యామలాసెంటర్‌లో రోడ్డుపైకి చేరిన నీరు



నీటి మునిగిన కృష్ణానగర్



ముంపుబారిన ఆదెమ్మ దిబ్బ

వదలని వాన.. కదలని ధాన్యం

- రవాణాకు వరుణుడే అడ్డంకి
- ఆందోళనలో అన్నదాతలు

కడియం: కళ్లాల్లో ధాన్యం.. మిల్లులకు చేరడానికి వరుణుడే అడ్డం పడుతున్నాడు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. అయితే కోతలు కోసి 17 శాతం తేమతో రవాణాకు ధాన్యాన్ని రైతులు సిద్ధం చేశారు. కానీ అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. కాసేపు వాన, కాసేపు మబ్బులు, మరికాసేపటికే భారీ వర్షం ముంచెత్తుతోంది. దీంతో పూర్తిగా ఎండిన ధాన్యం కూడా వర్షం ధాటికి తేమ లాగేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కడియం మండలంలో సుమారు నాలుగువేల హెక్టార్ల వరకు వరిసాగు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 1121 రకమే సాగవుతోంది. పది నుంచి పదిహేను శాతం మంది బొండాలు రకం వేశారు. మార్చి చివరి వారంలో కోతలు ముమ్మరమయ్యే సమయంలోనే అకాల వర్షాలు వచ్చిపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇంకా సుమారు 66 శాతానికి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సుమారు 6,100 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు జరిగాయన్నారు. 4,220 వేల మెట్రికల్ టన్నుల ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉందని అంచనా వేస్తున్నారు.

రైతుల ఇబ్బందులు

తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దానికి అనుగుణంగానే వ్యవసాయ, రెవెన్యూ విభాగాల సమన్వయంతో చర్యలు చేపట్టారు. అయితే వరుణుడు కరుణించక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆఫ్‌లైన్ విధానంలోనూ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కడియం మండలం పరిధిలో రెండు రైసుమిల్లులు, పెడపర్తిలో ఒక మిల్లును కేటాయించారు. పూర్తిగా ఆరిన ధాన్యాన్ని కూడా వాహనాలపై లోడ్ చేసుకునే అవకాశం ఇవ్వకుండా వర్షం పడుతుండడంతో సర్వత్రా ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం రాశులపై కప్పి ఉంచిన బరకాలు

ధాన్యానికి మొలకలు!

వర్షం విడవకపోతే కళ్లాల్లో ఉన్న ధాన్యానికి మొలకలు వచ్చేస్తాయని రైతులు చెబుతున్నారు. మెరక ప్రాంతాల్లో వేసిన ధాన్యం కొంత మెరుగేనని, పల్లపు ప్రాంతాల్లో ఉన్న ధాన్యం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వర్షపు చెమాయింపు తగిలి మొలకలు వస్తున్నాయన్నారు. వర్షం వీడితే తప్ప ధాన్యం రవాణాకు అవకాశం లేదంటున్నారు. వీలైనంత వరకు వేగంగా ధాన్యాన్ని రవాణా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. క్షేత్రస్థాయిలోఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. నూకశాతం పరిశీలించే యంత్రం కూడా తహసీల్దార్ కార్యాలయంలో టెక్నికల్ సిబ్బందితో సహా రైతులకు అందుబాటులో ఉందని ఏవో వివరించారు.

భారీ వర్షం.. జలమయం..

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో బుధవారం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నీటితో మురుగునీటి కాలువలు పొంగిపొర్లాయి. కృష్ణానగర్, ఆదెమ్మ దెబ్బ, ఆర్యాపురం, కంబాలచెరువు సెంటర్, కోరుకొండ రోడ్, జేఎన్‌రోడ్, శ్యామల సెంటర్, పేపర్‌మిల్లు రోడ్, హైటెక్ బస్టాండ్, రామచంద్రరావు పేట తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

రాజమహేంద్రవరం రూరల్: గత రెండు రోజులుగా మండలంలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బొమ్మూరు నుంచి బాలాజీపేట వెళ్లే రోడ్డు, శ్యామలాసెంటర్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలో 96 శాతం వరికోతలు పూర్తయ్యాయి. కోలమూరు, రాజవోలు గ్రామాల్లో కొంచెం మేరకు వరికోతలు కోయాల్సి ఉంది. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వరికోతలు కోసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలిస్తున్నట్టు వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు.

ధవళేశ్వరంలో కుంభవృష్టి

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో బుధవారం ఉదయం నుంచి కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో గ్రామంలో పలు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రైనేజీల్లో పూడికలు అడ్డు రావడంతో రోడ్లపై గంటల తరబడి నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.



బాలాజీపేట రోడ్డులో నిలిచిన నీరు



కంబాలచెరువు వివేకానంద జంక్షన్‌లో వర్షపునీరు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక శ్యామల సెంటర్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎఫ్‌టీయూ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ప్రజాసంఘాలు, పౌర సంఘాల ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు నిరసన కారులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆయా పార్టీలు, సంఘాల నాయకులు టి.అరుణ్, బి.రాజులోవ, కె.రాంబాబు, కె.జోజి, బాలేపల్లి మురళీధర్, నల్ల రామారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు.



శ్యామల సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

మర్యాదపూర్వకంగా..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం బోధనాసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్లుగా బాధ్యతలు స్వీకరించిన ఏ.జోషి విజయకుమారి, కె.ఝాన్సీలక్ష్మీబాయి, ఎస్.ప్రభావతి బుధవారం ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణతో సహా పలువురు విభాగాధిపతులు వారికి అభినందనలు తెలిపారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నూతన వైద్య కళాశాలల ఏర్పాటు, వయో పరిమితి పెంపు ఉద్యోగులకు వరంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ ప్రతిష్ఠాత్మక నిర్ణయాల కారణంగానే హెడ్ నర్సులుగా ఉద్యోగ విరమణ పొందాల్సిన ఎందరో, నర్సింగ్ సూపరింటెండెంట్లుగా అవకాశం పొందారన్నారు. గ్రేడ్ – 2 హోదాలో బాధ్యతలు చేపట్టిన నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్ –1 కు చేరాలని ఆకాంక్షించారు.



డాక్టర్ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్లు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కోరారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో రైతుకు పండించుకున్న పంటను అమ్ముకొనే స్వేచ్ఛ ఉండేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు ఆ స్వేచ్ఛను కోల్పోయాడని విమర్శించారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల సత్యనారాయణ (చంటి), కడియం మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ (నాని, మార్ని వాసుదేవ్ పాల్గొన్నారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ

అనపర్తి: పొలమూరులో రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాల స్వామివారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రధాన కర్తలుగా, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ప్రియాంక దంపతులు విశేష పూజలు చేశారు. ఈ పూజా క్రతువులను తిరుమల తిరుపతి దేవస్థానం విద్వాంసుడు వేదాంతం శ్రీవిష్ణు భట్టాచార్యులు, మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారంతా స్వగ్రామానికి చేరుకుని ఈ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు యంత్ర, విమాన శిఖర, బలిపీఠ, జయ తదిత విగ్రహ ప్రతిష్ఠ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి విజయమణి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి రమా, సత్తి బ్రహ్మారెడ్డి గంగాపార్వతి, తాడి సత్తిరెడ్డి సుబ్బలక్ష్మి, తాడి వీరవెంకటరెడ్డి కమల, సత్తి వెంకటరెడ్డి వీర అనంతలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి ఆదిరెడ్డి వీరయ్యమ్మ దంపతులు పూజలు చేశారు. సాయంత్రం జరిగిన రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీమదన గోపాలస్వామి వార్ల శాంతి కల్యాణంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని క్రతువును జరిపించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, ప్రియాంక

వైభవంగా మేలుకొలుపు

బిక్కవోలు: పందలపాకలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి మేలుకొలుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు పడాల రామారెడ్డి తెలిపారు. ఐదేళ్లకు ఒక్కసారి జరిగే ఈ జాతర 5 రోజుల పాటు జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలను గ్రామంలో ఊరేగించారు. 8వ తేదీతో వేడుకలు పూర్తవుతాయన్నారు. అమ్మవారిని పడాల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు.



పందలపాకలో సత్తెమ్మ తల్లి విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కుంతీదేవి జాతర ప్రారంభం

ఊలపల్లిలో కుంతీదేవి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఊరేగింపుగా పొలాల నుంచి వరి దుబ్బులు తీసుకువచ్చి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటి నుంచి మే 23 వరకూ జాతర మహోత్సవాలు జరుగుతాయని కుంతీదేవి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

21 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: ఆల్‌కట్ గార్డెన్ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను రెండో పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఆల్‌కట్‌గార్డెన్‌కు చెందిన ఎంంంంం.సాయికుమార్, ఎం.దుర్గాప్రసాద్, హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన శ్రీదుర్గాప్రసాద్‌లు ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో అమ్ముతున్నారు. దీంతో పోలీసులు ఆల్‌కట్‌గార్డెన్ ప్రాంతంలో దాడి చేసి ముగ్గురుని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించడంతో పోలీసులు సెంట్రల్ జైలుకి తరలించారు.

620 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 620 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

97.20 శాతం పింఛన్ల పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో షేక్ గౌసియాబేగానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వర్ధిని

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రెండోరోజు బుధవారం రాత్రి 9 గంటల వరకు 97.20 శాతం పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,34,724 మంది లబ్ధిదారులకుగాను 2,28,163 మందికి రూ.62.89 కోట్లను వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు అందజేశారు. తాళ్లపూడి మండలం 98.01 శాతంతో ప్రథమస్థానంలో, కోరుకొండ మండలం 95.98 శాతంతో చివరిస్థానంలో ఉన్నాయి.

దొండ రైతులకు నష్టాల బెంగ

- పడిపోయిన ధర
- కిలో రూ.3కు వ్యాపారుల కొనుగోలు

సీతానగరం: దొండ రైతులకు నిరాశే మిగిల్చింది. అందిన కాడికి అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి లాభాలు వస్తాయని సంబరపడే సమయంలో ఒక్కసారిగా ధర పడిపోయింది. దీనితో నష్టాలే మిగిలాయి. ముఖ్యంగా రైతులు దళారుల చేతుల్లో మోసపోతూనే ఉన్నారు. వారు కిలో రూ.3కు కొనుగోలు చేసి, దుకాణాల్లో మాత్రం రూ.25 నుంచి రూ.30 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. మండలంలోని సుమారు 600 ఎకరాల్లో దొండపాదులు సాగవుతున్నాయి. వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, సీతానగరం, చినకొండేపూడిలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వరకు శిస్తు చెల్లించి దొండ పాదులు పెట్టారు. వాతావరణం కూడా అనుకూలించడంతో పాదులు మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే పది కిలోల దొండకాయలు రూ.160 వరకు ఉండే ధర ఒక్కసారిగా పది కిలోలు రూ.30కి పడిపోయింది. దీంతో రైతులు ఒక్కసారిగా కుదేలయ్యారు.

ఎకరానికి రూ.2 లక్షల ఖర్చు

ఎకరంలో దొండ సాగుకు సంబంధించి విత్తనాలు, పందిరి కర్రలు, వైర్లు, పాదుల పెట్టుబడి, కోత కూలీలకు, ఎరువులు, పురుగుల మందులకు కలిసి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. శిస్తు రూ. 60 వేలు పెట్టిన రైతులకు పెట్టుబడి, శిస్తు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. ఎనిమిది నెలలు పంట అయిన దొండపాదులు రెండు నెలలు అనంతరం ఆరు నెలలు కాపులో ఉంటుంది. ఈ ఏడాది ఎకరానికి పంట పూర్తయ్యే సమయానికి 20 నుంచి 30 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. వాతావరణం అనుకూలిస్తే 35 టన్నులకు పైగా వస్తుంది.



చినకొండేపూడిలో సాగుచేస్తున్న దొండపాదులు

రైతుల ఆవేదన

ప్రస్తుతం పది కిలోల దొండకాయలు కేవలం రూ.30 మాత్రమే ఉండటంతో ఏమి చేయలేని పరిస్థితిలో రైతులున్నారు. కాయలను నిల్వ ఉంచి అమ్మకాలు జరపడానికి వీలులేని పరిస్థితి. వారానికి ఒక్కసారి మాత్రమే దొండకాయలు కోసి, పంటభూమి వద్దకు వ్యాపారులు వచ్చి, తూకం వేసుకుని కొనుగోలు చేస్తున్నారు. ఆ విధంగా కొనుగోలు చేసిన దొండకాయలను వ్యాన్లపై ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు.

నష్టాలే మిగిలాయి



రెండు ఎకరాల్లో దొండపాదులు పెట్టాను. ఎకరం శిస్తుగా రూ.55 వేలు చెల్లించి, పెట్టుబడిగా రూ.రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం కిలో ధర రూ.3 మాత్రమే ఉంది. దీనితో నష్టాలు కలుగుతున్నాయి.

– మేడిశెట్టి శ్రీనివాస్, కౌలు రైతు, చినకొండేపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరంలో దొండపాదులు పెట్టాను. ప్రస్తుతం కిలో దొండకాయలను రూ.3కు కొనుగోలు చేస్తున్నారు. శిస్తు, పెట్టుబడి రూ.2 లక్షలు అయ్యింది. అంతా నష్టమే. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– తోరం శోభనబాబు, కౌలు రైతు, లంకూరు

ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు



మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

రాజమహేంద్రవరం సిటీ: ప్రశ్నించే వారిపై రాష్ట్రంలో తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించడం దారుణమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీకి మాజీ ఎమ్మెల్యేలతో కలసి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి వాసుపై తప్పుడు కేసులు పెట్టి వేధించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ఉన్నారు.

మహిళ అదృశ్యం

కంబాలచెరువు: సీటీఆర్‌ఐకు చెందిన షేక్ జరీనా (62) అదృశ్యంపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఆమె మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.